కథానిక:

ఒంటరి బంగళా

శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ

హోరున గాలి వీస్తోంది.

పైన అంతా మబ్బు కమ్మి కన్ను పొడుచుకున్నా యేమీ కానరావడంలేదు. ఎనిమిదిగంటల రాత్రప్పుడు జనసంచారం యేమీ లేకుండా—బొత్తిగా క్షీణించినట్లు అనుకునేందుకు వీల్లేకుండా, పుండీ వుడిగీ వో ముసుగేసుకున్న రిక్షా, తరువాత పదినిముషాలకు వో సైకిలు, బాగా విరామమిస్తూ ఘల్లుఘల్లుమని సన్నగా ప్రారంభించి జలజలమని పారే బురదనీటిని డెక్కలతో చిందగొడ్తూ యెక్కడికో చీకట్లో—అంతర్ధానమయే వో జట్కా వీట్లను గమనిస్తూ మధ్యను వోమాటు బంగళా గేటువైపు దృష్టిని విసిరి తిరిగి ఆ నిశ్శబ్దంలో అద్దాల గాజుపలకలమీది నీటిని తొలగిస్తూ ఆ గుడ్డను బాల్చీలోకి పిండుకుంటూ తన పనిలో మునిగిపోసాగాడు ధర్మయ్య.

ఆ వొంటరి హాల్లో జాగ్రత్తగా అమర్చిన బల్లలు కుర్చీలు అలవాటులేని నిశ్శబ్దానికి గింజుకొంటున్నట్లున్నాయి.

ఎక్కడో పిడుగుపడింది. ఆకాశం వురిమి గర్జనలుచేసింది. ఒక్క మెరుపు మెరిసి కొండలు, వూరు, చెట్లు, అన్నీ తళుక్కుమన్న కాంతిలో మిలమిలలాడాయి.

బంగళా ముందు తోట అంతా నీళ్లతో ముంచెత్తి అంత క్రితం జాగ్రత్తగా, నడవటానికి చేసిన దారులు మొక్కలకు త్రవ్విన బోదెలు కట్టిన కంచెలు సర్వం కొట్టుకుపోయినై.

—వాన తగ్గలేదు. కాని ఉధృతం కాస్త సడలింది.

రోడ్డుమీద దూరాన ఎలక్ట్రిక్ దీపాల వెల్తురు ప్రసరించిన చోట్లలోమాత్రం తూములుకాలువలు నిండిపోయి నీరు సవ్యాపసవ్యంగా రోడ్డుమీద పరుగులెత్తటం చూడవచ్చు.

ఆ వొంటరి బంగళాయొక్క దీపాలులేని క్రింది చీకటిహాల్లోనుంచి ఒక జాతికుక్క పదేపదే భయంకరంగా అరుస్తూ మొరుగుతూ ఆ ఆవరణలోని నిశ్శబ్దాన్ని చీల్చి చెండాడుతోంది. దాని అరుపు విన్నప్పుడుమాత్రం ధర్మయ్య ముఖం కొద్దిగా వివర్ణమవుతోంది. తుడుస్తున్న గాజుపలకమీది చేతిని అట్టా ఆపించి భయంతో బంగళాగేటువైపొకచూపు విసిరి నిట్టూరుస్తున్నాడు. ఆ హాల్లోనికి మూసిన ద్వారాలతో వరుసగా యేర్పాటుగావున్న చక్కటి మూడుగదులు—వాటి గుమ్మాలకు కిటికీలకు పొందికగా కట్టిన తెరలు గాలిలో స్వేచ్ఛకోసం పెనగులాడ్తూ కదలాడ్తూండగా—

“ఆ పెధవ కుక్క యెందుకలా మొరుగుతుంది?” అన్న గర్జన.

ప్రకృతిలోని యీ సంక్షోభం చీదరపాటువలన కలిగిన కోపమంతా ఆ కంఠంలో ఆ కుక్కమీద స్పష్టంగా రూపుమాచ్చుకుంటోంది. బుజంమీది గుడ్డను తలకు చుట్టుకుని ధర్మయ్య వూగుతూ నెమ్మదిగా చెక్కమెట్లమీదినుంచి దిగువకు జారుతున్నాడు. తరువాత మేడమీది హాల్లోని చీకట్లో ఎర్రగా వెలిగి మసిగ్రమ్ముతూన్న పైపుతో ఒక నల్లటి నీడ యిట్నుంచి అటూ అట్నుంచి యిటూ తచ్చాడుతూండటం బంగళా గేటువద్దనుంచి కూడా జాగ్రత్తగా పరిశీలిస్తే అగుపడొచ్చు.

పనిలేని వీధికుక్కలు ‘భంయ్’మని అరుచుకుంటూ దారి వెంటపోయే ఒక చీకినగోనెల్లో తడిసిన ముష్టివాణ్ణి ఆగిఆగి నిలబడి వెనుకనుంచి తరుముతూండగా వాడు కంకరరాళ్లలో బెదరిస్తూ గోల చేసుకుంటూ పరుగెత్తుతున్నాడు. ఈ మధ్యలో హఠాత్తుగా ఎక్కడ్నుంచో ప్రారంభమయిన గుఱ్ఱపుడెక్కల ధ్వనిలో కంకరరాళ్ల చప్పుడు లీనంకాగా, అసాధారణమైన వేగంతో పరుగెత్తి వచ్చిన ఒక బలిష్ఠమైన గుఱ్ఱం పూర్తిగా తడిసిపోయిన బండీని వేగాన్ని తగ్గించుకుంటూ లాక్కునివచ్చి, ఆ నీళ్లలో బంగళా గేటువద్ద ఆగింది.

ముష్టివాణ్ణి తరిమివచ్చిన కుక్కలు గుఱ్ఱపుబండీ చుట్టూ నిలబడి చోద్యంచూస్తున్నాయి. తలగుడ్డతీసి బుజానికి లాక్కుని బంగళాగేటువద్ద నిలబడిపోయి గొంతుక పూడుకుపోగా ‘చినబాబుగారూ’ అనిమాత్రం అనగలిగాడు ధర్మయ్య. ఆ బండీకి కట్టిన దీపంబుడ్డిలోకి కొద్దిగా నీరు చిందటంవల్ల చిటపటమనే చప్పుడు, చమురుగుడ్డ కాలిన వాసన వెలికిరాగా, ఎవరూ అడక్కుండానే ‘కలకత్తామైలు గంట లేటు బాబూ—’ అన్నాడు సామాన్ను కేరవేస్తున్న బండివాడు. బండిలోంచి దిగిన వ్యక్తి రబ్బరు వానకోటుమీదనుంచి కారుతున్న నీటిని వొక్కమాటు దులుపుకుని ఆ గేటును తోసుకు బంగళావైపు నడిచాడు.

బంగళా పైహాల్లోని అద్దాల గాజు తలుపులు తెర్చుకున్నాయి. ఎర్రటి పైపు నల్లటినీడ ముందుకు త్రోసుకునిరాగా ఆ కంఠంనుంచి వచ్చింది ‘ఎవరది?’ అన్న ప్రశ్న.

మరోకమారు బంగళాక్రింది కుక్క మొరొర్యామని అరిచింది.

ధర్మయ్య వెనుకనుంచి, ‘చినబాబుగారు పూర్తిగా తడిసిపోయారు’ అని గొణుక్కున్నాడు. పైనుంచి చేత్తో నోట్లోని పైపును తీసి పట్టుకున్న చీకటినీడ పిల్చిన ‘రాజా—’ అన్న గంభీరమైన పిలుపుకు యీ వచ్చినవ్యక్తి ‘హ్హా’ అనిమాత్రం ఇవ్వగలిగాడు.

అద్దాల గాజుపలకల తలుపులు ఒక్కమాటు మూసుకున్నాయి.

రాజు క్రింది వరండాలోని ప్రాతగిలిన కుర్చీ కాలికి తగులుగానే వానకోటువిప్పి దానిమీదకు విసిరి తల తడుముకుని తెండు

చేతుల్లో జుత్తును పీకేసుకోసాగాడు. నీళ్లు టపటపమని నేలమీద చిందుతున్నాయి. బండివాడు యిక యెవర్నీ అడగ నవసరం లేకుండానే చిరపరిచితుడులా సామాన్లు మీదకు చేరవేసి వెళ్ళిపోయాడు.

'పైకి నడవండి బాబూ' అన్న నవుకరు మాటలు వినిపించుకోకుండానే 'తాళాలుతియ్యి ధర్మయ్యా, ఇల్లంతా చూడాలి' అన్నాడు రాజు.

హాల్లోని కుక్క బైట మనుష్యుల అలికిడికి గింజుకుంటోంది అరుస్తూ. కిటికీమీద కాలునుమోపి 'జిమ్మీ' అని పిలుస్తూ చిటికె వేశాడు. క్రింద లైట్లన్నీ వొక్కమారు వెలిగాయి. ధర్మయ్య క్రింది హాల్లోకి తలుపుల్ని తీసి ప్రక్కగావచ్చి నిల్చున్నాడు. రాజు చరచరా కుక్కను గట్టిన గొలుసు దగ్గరకు వెళ్లగానే లోతుకు దించుకుపోయిన కళ్లు దవడలతో 'జిమ్మీ' మీదమీదకు యెగుర్తూ నాకుతూ ఆప్యాయతను ప్రదర్శించింది.

ఇల్లంతా చెల్లాచెదరుగానూ నానా కంగాళీగాను వున్నట్లుంది.

'పిన్ని యెక్కడ జిమ్మీ' దుఃఖంతో రాజు గొంతుక బొంగురుపోయింది.

ఎక్కడ పడితే అక్కడ అనవసరపు సామాను—మంచాలు అడ్డదిడ్డంగా పడివున్నాయి. పరుపులు తలగడాలు కొన్ని క్రింద కొన్ని కుర్చీల్లోనూ వివిధ రకాల మందు సీసాలు మూతలు తీసినవి కాళీవి ఎక్కడ పడితే అక్కడ దొర్లుతున్నాయి. కంగారులో తీసిన అలమారా బీరువాల తలుపులు వేసేందుకు యెవ్వరూ లేరు. నేలమీద మందు నీళ్లు పళ్లరసాల చారికలు ఎండిపోయి మచ్చలు కట్టాయి. గ్లాసులు చెంబులు నీళ్ళబిందెలు అన్నివైపులా చిందర వందరగా యెక్కడ పడేసినవి అక్కడ అట్లానే వున్నాయి. ఒక కాళీ మంచంవద్ద మాత్రం తలవైపున జాగ్రత్తగా అమర్చిన టేబిలు ఫాను వొంటరిగా దిగులుగా నేలకు దిగజారిన వైరుచుట్టతో గది అంతా పొంచి చూస్తున్నట్లుంది.

'ఈ యింట్లో యెవరూ ఎప్పుడూ సుఖపడలేరు ధర్మయ్యా.' బైట గాలీ—వానా అంతా తగ్గి ప్రకృతి ప్రశాంతతను తిరిగి కోలుకొంటోంది.

'పిన్ని నా గురించి వొక్క ముక్కఅన్నా చెప్పిపోలేదా ధర్మయ్యా?'

రాజు తల ప్రేలాడేసుకుని సోఫాలో కూలబడ్డాడు. ధర్మయ్య పొడిబట్టల్ని చేత్తో పుచ్చుకుని ప్రక్కను నిలబడ్డాడు, వేడి కాఫీ పొగలు గ్రక్కుతూన్నది అలాగే బల్లమీద వుండిపోయింది.

2

మనస్సు గుర్రంలా పరిగెడ్తూంటే, వయస్సుని కాలాన్ని చూసి సాంఘికధర్మం 'ఛీ' అని కసిరికొట్టే—'వృత్తికి న్యాయవాదవే గాని జీవితంలో అన్యాయాల్ని సమర్థించుకొంటున్నా'వని కన్నకొడుకు తీవ్రంగా ఎదిరిస్తే, కన్నీళ్ళ అశక్త దుర్భర దారిద్ర్యం ఎటువంటివో రుచిచూడకపోయినా—కౌనివయస్సులో చిలిపితన మనిపించుకున్నప్పటికీ, హృదయానికి పడుచుతనపు పోకడలు రప్పించుకుని, బీటలువారిన జీవితంలో నందనవనవాటికను నిర్మించుకుని అమృతవర్షం కురిపింపచేయాలనీ, జీవితాకాశాన కోరికల మబ్బుగుర్రాలసవారీ సాగించాలని—లోకంతో పోరాడి 'ఆనందము-శ్రీ' గిరిగీసినట్లు కుర్రవాళ్లకే హక్కుభుక్తాలు కావని వొప్పించబోతే—'ఈ భోగభాగ్యాన్ని పెంచుకుని జీవితాలమీద అక్రమంగా దాడి చెయ్యకపోతే, ద్రవ్యాన్నీ పరువునీ ప్రతిష్టల్నీ విరజిమ్ముకొని ఎదటివారి దురవస్థల్లో చేజిక్కించుకున్న అవకాశాలతో దారుణావమానాలు చేయకపోతే—తమకన్నా చిన్నవాళ్ళ జీవన యమునా తీరంలో తాజమహల్లను కట్టి యివ్వరాదా? చరిత్ర - కళలూ, సంఘమూ, ప్రవహించే దిక్కున గోచరించే ఏకైక లక్ష్యం మానవాభ్యుదయమే! సాంఘికధర్మాలు న్యాయమూ చట్టమూ అన్నీ అటువైపుకే! భవిష్యత్తుమీద మన ముందుతరంమీద విశ్వాసం లేని వాళ్లు చేసే ఆత్మబలిదానం దేశానికి అక్కరకు రాదు. ఎడారిలో నడుస్తూ మిఠాయిల్ని తల్చుకుని నోళ్లలో నీరూరించుకొంటూ వెనక్కు వెనక్కు పరుగెట్టే అసూయాగ్రస్తులు వెనకటి రోజులే బాగున్నాయి కాలం మారింది ప్రపంచం చెడిపోయిందని తిడ్తూంటారు. ఈ యుగసంధిలో యీ గతితార్కిక భావసంఘర్షణసమ్మర్దంలో ఆవేశాల కావేషాల సంకులసమరంలో—మేడమీద న్యాయవాది తండ్రి రామదాసు పంతులు, క్రింద కొడుకు చోటా న్యాయవాది రాజేశ్వరరావు—ప్రత్యర్థులుగా నిలబడ్డారు.

పిట్ట చేతిలోంచి ఎగిరిపోతే వ్రాలిన చిత్రాంగి మేడలో దూరి 'పావురమియ్యావె పిన్నమ్మా నా—' అనైనా అనకుండానే, రాజేశ్వరరావు, చెరగని అవమానాన్ని అఖండాల భాండాల విషాన్ని వొలకబోసుకున్న ఆ బంగళాలోకి వచ్చి 'పిన్ని నాగురించి వొక్క ముక్క అన్నా చెప్పిపోలేదా ధర్మయ్యా' అని అడిగాడు.

ఈ భయంకర భీతావహ కథాకదనంలో ధర్మయ్య పంచశీల మరమేకులా చుట్టుకుని ముందుకు నెట్టుకువచ్చాడు. కాని ... కానైతే...ఇప్పటికిది జరిగి ఓదశాబ్దమైయుంటుంది. నూరేళ్లు బ్రతకాలనీ, పండ్లంటి పిల్లాపాపలతో వెయ్యేళ్లు కాపురం వర్ధిల్లాలనీ, నొసట కుంకుమరేఖలుదిద్ది బుగ్గనుచుక్కబెట్టి, ఒళ్ళో కొబ్బరిబొండాన్నుంచి, అలంకృత చేతిలో చెయ్యేయించుకుని, కందపిలకవోము నోపించి 'పోయిరావమ్మ జానకీ' అని సన్నాయిమేళంవాళ్లు పాడుతూండగా—కన్నీళ్లతో తమ సర్వస్వాల్ని బిడ్డల భవిష్యత్తుకై సంతోషంతో అంకితమిచ్చే కన్నవారు ఉన్నవారుగాకపోవటంచేత అంతమైన రాధ జీవితకుసుమం ఎడారిలోపడి వడిగి ఎండి కృంగి కృశించిపోయింది. చెదరిన ముంగురులతో, బెదరిన కళ్లతో, తడబడ్తూ తడబడ్తూన్న కాళ్లతో, గలగలమని చప్పుడు చేసుకుంటూ, ఇంట్లోకివచ్చి కలకలమనిపించిన ఆ అందాలబాలను 'పిన్నీ' అని పిలవాల్సొస్తుందని ఊహామాత్రంకూడా శంకించలేకపోయాడు రాజు, శంకించవలసిన ఝంఝాటమైపోయాక కూడా తండ్రి తన్ను బహుచమత్కారంగా క్రూరమైన అపనింద అవమానాల పాల్జేసినప్పటికీ, ఏ కన్నీటిని కొలువాళ్లని రాత్రుకు దూరంచేయాల్సిన విధి అని తెలు

గొంతుకలు విచ్చినట్లుగా, నడులన్నీ పొంగి కట్టల్ను త్రెంచుకుని ఉరికినట్టుగా, ఉద్రేకం ఉత్సాహం పొంగిపోయి, కొంపా గోడూ వదిలిపెట్టి, చదువూసంధ్యా, వృత్తి, అంతస్థు ఉద్యోగం, హోదాలకు - దూరంగా నెట్టివేసి పారిపోయేట్లు చేసిందో, ఆ శ్రమా—ఆవేశం - అంతా వ్యర్థం నిష్ఫలమైపోయేసరికి, పరాజితుడిలా ఆ ఒంటరిబంగళాలో శ్మశానాల ప్రశాంతత తాండవిస్తూన్న ఆ నైరాశ్యపు నిశీథ వాతావరణంలో, 'జిమ్మో' భయంకరంగా అరుస్తూంటే—మేడ దిగి ఈవలకురాని రామదాసుపంతులుయొక్క అవిరామ పదధ్వనులను ఆలకిస్తూ రాజేశ్వరరావు చిత్రించిన రాధాదేవి అమాయిక మనోహర ముఖకమలాన్ని మనఃఫలకంమీద చిత్రించుకోసాగాడు.

ఠంగు ఠంగుమని గడియారం రెండుగంటల్ని కొట్టింది. రాజు చటుక్కున లేచి దుస్తుల్ని సంభాళించుకొని రబ్బరుకోటును మీద కప్పుకుని 'ధర్మయ్యా-' ఆగి 'తాళాలు కావాలి' అని గర్జించాడు. ఇద్దరూ బంగళావదలి షెడ్డువద్దకువచ్చి నిలబడ్డారు. తలుపులు తెర్చు కున్నాయి. కారు ఈవలకు వచ్చింది. 'ఎక్కు-' అన్నాడు రాజు. కారుతలుపుమీద ధర్మయ్య చేయి వేయబోయాడు. 'ఎక్కడికి' అన్న గర్జన మేఘమీంచి వచ్చింది. 'శ్మశానానికి' అన్న మాటతో పాటు వెలికివచ్చినకారు త్రాచుపాములా నీళ్లను రాళ్లను దూసు కుంటూ నిర్మానుష్యమైన జనపథంగుండా చీకట్లోకి పోయి అంతర్హితమైంది.

శ్మశానంలో రెండు క్రొత్తశవాలు కాలుతున్నాయి. ఆ తాలూకు మనుష్యులు దూరంగా గుంపుగా నిలబడి చూస్తున్నారు. సుదూరాన కట్టెలఅడితి గొంతిక కూర్చున్న రాతుసిలా చీకట్లో వికృతంగా అగపడ్తోంది. శ్మశానంలోని ఎర్ర అకుపచ్చరంగు మంటలు ధూమం పైకిలేచినప్పుడు—బూడిద కుండపెంకులు రాళ్లు కొరకంచులతో ఆ నేల భీతావహంగా దర్శనమిస్తున్నది. దూరంగా యేరు నిద్రపోతున్నది. అక్కడా అక్కడా పొంచిచూస్తున్న నక్కలు వికృతంగా గానంచేస్తున్నాయి. కాటికాపరి చేతిలో కర్రతో నిర్వికారంగా నిలబడి ఖాళీగా చూస్తున్నాడు. కారు నేరుగావచ్చి శ్మశానంలో ఆగింది. ఇద్దరూ బయటకు దిగి నెమ్మదిగా రాధాదేవిని ఖననంచేసినచోటుకువచ్చి ఆగారు. ఏమీమిగలకుండా తెల్లటి సురుసులాటి బూడిద తడిసిపోయిన వాననీటిలో చితపత లాడుతూన్న అయిదడుగల మేరను వంగుని చేత్తో బురదను ఆప్యాయంగా ప్రోగుచేస్తూన్న రాజును బుజంమీద తడ్తూ 'ఇదేమిటిది ? మీకేం పిచ్చా చినబాబుగారూ ?' అని ధర్మయ్య వెనక్కు లాగాడు.

'పిన్ని యిక్కడ నిద్రపోతోంది' అని మునివ్రేళ్లను బురదలో పూతంగా అన్ని 'నీకోసమే యిల్లువిడిచి పారిపోయానుగా పిన్నీ— అప్పుడే వెళ్ళిపోయావా ? బుజావుచెయ్యలేని అవమానాల్ని చెర గనిమచ్చగా మోసుకుంటూ తిరగమన్నావా నన్ను.'

ధర్మయ్య శారీరకబలమంతా వుపయోగించి రాజును గుంజుతూ 'పిచ్చిపన్లు చెయ్యకండిక. పోదాం—యింటికి.'

'ఇంటికా—రాను. అక్కడకన్నా యిక్కడ చాలా ప్రశాంతంగా హాయిగా వుంది.'

'రండి'—ధర్మయ్య బలవంతాన రాజును లాక్కొంటూ షెడ్డులోకి తీసుకువెళ్ళాడు. రబ్బరుకోటు పంట్లాం అంచులు బురదబురదయాయి. రాజు ముఖం ప్రక్కకు త్రిప్పుకొని యేడుస్తు న్నాడు.

శవాలు పూర్తిగా కాలిపోయాయి. బంధుగులు యిళ్లకు వెళ్ళి పోయారు. కాటివాడు రెండుచేతుల్తో ఖాళీపాడెల్ను సగంకాలిన కొరకంచుల్ని బురదలో ఆర్పి కట్టెల్ను ప్రోగుచేసుకుంటున్నాడు. ఎవరో చితుకు లేరుకొనేపిల్లలు వచ్చి యీ ప్రోగునాది యీ ప్రోగు నాది అని తగూలాడుకుంటూ బొగ్గుల్ని తట్టల్లోనూ బుట్టల్లోనూ యేరుకొని వేసుకుంటున్నారు. తెల్లవారవచ్చింది. ధర్మయ్య 'లేవండి—రాధాదేవి అఖరికోరిక తీర్చివద్దాం పదండి. ఇంకా తెల్ల వారటానికి రెండుగంటలుందికదూ—చాలు ఆ వ్యవధి.'

'అఖరికోరికా—కోరికలేమీ వుండవనుకున్నానే.'

ఇద్దరూ నడచివచ్చి కారులో కూర్చున్నారు. ధర్మయ్య సందేహిస్తూ—

'ఈరోజు ఎల్లా వానకురిసి చిందరవందరగా వుంటో ఆనాడూ సరిగా యిల్లానే కారు ముందుకు పోతుందా అని సందేహించాం. పోకపోయినా బాగుండిపోయేదేమో....'

రాజు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. కారు చక్రాలు వేగంగా చుట్లుతిరుగుతూ నీళ్ళను రాళ్లను పల్లాల్ని గతుకుల్ని దాటి పరుగులు బెడ్తోంది.

'ఆ యిటువైపే—తిన్నగా...బస్. రోడ్డు బాగానే వుంది. చూడండి చినబాబుగారూ — మీరు కలకత్తాలో చదువుకొంటు న్నారు. బ్యాంకులో చెప్పి నెలనెలా మీకు చెక్కుపంపే యేర్పాటు చేసేశారు నాన్నగారు. మీకు అమ్మగారు గుర్తున్నారా? ఆవిడే పోకపోయుంటే నాన్నగారు మీ అతీ గతీ పట్టించుగోక పోయేవారంటారా?'

రాజు తల్లిని గుర్తుచేసుకుందామనేసరికి యేవీ స్ఫురణకు రాకపోగా బంగళాలోని గదిలో నాన్నగారు హోదాకు వ్రాయిం చిన నిలువుసైజు తైలవర్ణ చిత్రం ధర్మయ్య మాట్లాడుతూంటే—ఆ బొమ్మకు ఎదురుగ్గా నిల్చొని అనేకసార్లు ఆప్యాయతను కోరి తెచ్చుకోబోయి విఫలమయిన సందర్భాలు మనస్సులో మెదిలాయి.

'మిమ్మల్ని అమ్మగారు పోగానే కాన్వెంటు దొరసానిని పిలచి అప్పగిస్తూంటే వద్దని, లబలబలాడేను. ఆపేక్ష లాలన ప్రేమాభిమానాలకు దూరంచేస్తున్నారని గొడవచేస్తే పిడ్ని కనిపెట్టు కొని సాకటానికి ఇక్కడ ఎవరున్నారు? డబ్బుపారేస్తే సురక్షితంగా శిక్షణలో పెంచుతారు వాళ్లు అని నా నోరు మూయించేశారు.' రాజు కొంచెంకొంచెం చెప్పగోనవసరంలేని తన బాల్యాన్ని నెమరు వేసుగుంటున్నాడు. ఎప్పుడూ పండగలూ శెలవలూ యిళ్ళకు వెళ్ళడం అనేది ఎరగడు. ఎవరోవచ్చి ఎక్కడకో తీసుగెళ్ళటం ఆపేక్ష అభిమానాలు చూపించటం తెనెరగడు. ఈ ధర్మయ్యే నెల కోసారి వచ్చి చూసి కంట తడిపెట్టుకొని వెళ్లిపోతూండే వాడు. ఎప్పుడో యే మూర్ఖల్లకో వచ్చిచూసి వెళ్లి

పోర్టూ ప్రంకేవాసు లేంద్రి. కాలేజీలో చదువుకునే టప్పుడు కూడా సెలవుల్లో అన్ని పండగల్లోనూ హాస్టల్లో హోటల్లో వుండేవాడు తనొక్కడే. తన కెప్పుడూ ఎక్కడ్నుంచీ వుత్తరాలు రావు. వస్తే గడియారాల కేటలాగులూ పుస్తకాల వ్యాపారస్థులు ఏవన్నా సందర్భంలో వ్రాసినవి మినహాయించి. ఒడి దుడుకులు వుద్రేకం ఆవేశం అభిమానమూ చూడని రసహీనమైన జీవితంలోకి అర్థాంతరంగా వచ్చి తొంగిచూసిన మొదటి స్త్రీవ్యక్తి 'రాధాదేవి.'

తెలతెలవారుతోంది. పిట్టలు కిచకిచమని గోలచేస్తున్నాయి. పల్లెలనుండి పట్టణాలకి తరలివెళ్ళే పల్లె వనితలు పాలకావిళ్లూ పెరుగు తట్టలవాళ్ళూ దారిలో ఎదురవుతున్నారు.

'ఆవేళ మీసాల పాపారావు డ్రైవు చేస్తున్నాడు కారును. నాన్నగారే అతడ్ని వుద్యోగంలోంచి తప్పించేశారు. మీకు తెలుసా ?'

'కొంచెం విన్నట్లు గుర్తు—చూశానేమో, చూసేవుంటాను కూడా—'

'పాపారావు అమ్మగారి హయాంలో మంత్రి. పూజలు పురస్కారాలు వుత్సవాలు ధర్మకార్యాలు అన్నింట్లో విశేషంగా పాల్గొంటూ ఆ హయాంలో మీ యింట్లో వొక వెలుగు వెలిగించి, అటుదిటు తిరిగి కాలం మారగానే అనవసరపు మనిషయి తొలగించబడ్డాడు. నాన్నగారు చిత్రమైనమనుష్యులు సుమండీ! ఆయన స్వభావానికి ఎప్పుడూ యేది తడుతుందో, యెవరు యెప్పుడూ అనవసరమైపోతారో, ఏది ఎందుకు తప్పనిసరిగా మారిపోతుందో వూహించటం కష్టం. ఆయన మార్గానికి యేది కంటకమైతే దాన్ని సులువుగా తొలిగించేస్తారు. అత నిప్పుడు రూటుమీద బస్సులు నడుపుతున్నాడు. ఈమా రెప్పుడైనా కనుపిస్తే మిమ్మల్ని చూపిస్తే తప్పక సంతోషిస్తాడు. ఎంత ఎత్తుకు పోసేవాడని—'

రాజు ధర్మయ్య కేసి చూసి 'అవును నిజం. ఏది మార్గానికి అడ్డు తగుల్తుందో దాన్ని సులువుగా తొలగించి పరిష్కారం చేస్తారు. ఆయన నన్ను మార్గానికి దూరంగానే వుంచగలిగారు కాని పరిష్కారం అంత సులువుకాదు.'

దారి కిరుప్రక్కలా దట్టంగా పెరిగిన ఎత్తైన కొమ్మలు రెమ్మల సందులనుంచి లేత వాడి సూర్యకిరణాలు దారిమీద పడి తడిసిన బాటలో బంగారుఛాయల్ని చిమ్ముతూండగా కారు జర జరా బరిమీద పాములా సర్రున పోతున్నది. చిన్న చిన్న వుగ్రామాలు పల్లెలు గుడిసెలు అర్థనగ్నమానవుల దీనదేహాలు, మెళ్లో రంగుల పూసలు నడుంమీద చింకి పేలికలు, చంకల్లో నిసువులు శిశువులు, నెత్తిమీద తట్టలు—తట్టల్లో బొచ్చెలు కుండలు, చేతుల్లో పనిముట్లు—పారలు పలుగులు కొడవళ్లు, నెత్తిన పోగులు వెనుక మేకలు కుక్కలు దున్నపోతు బండ్లూ, ఎడ్లమందలు—అరుపులు తిట్లు పాటలు కొట్లాటల కోలాహలమంతా గడిచి రాజు దూరాన తెల్లటి చారలా పెంకుటిళ్ళూ దేవుడిగుడి పెద్దమేడతో కొ గ్రామాన్ని పోల్చుకొంటూ ధర్మయ్య కేసి చూశాడు. 'ఫో— వచ్చేస్తున్నాం. చినబాబుగారూ. యి...దేయి...సరిగ్గా-దేయిలానే ఆనాడూ వూరి పొలిమేరల్లో అడుగుపెట్టాడో లేదో—మేఘాలు క్రమ్ముకుంటూ వచ్చి కుంభవృష్టిగా వాన కురుస్తుంది. కారు సగం దారిలోనే బురదలో దిగబడిపోయి ససేమిరా కదలనంది. అదే ఆ తెల్లని ఎత్తైన భవంతి కనిపిస్తోందే అదే ధర్మరాజు మేడ. ఆ దేవో చాలా ముఖ్యమైన కేసు. ఆ కేసులో నిష్కారణంగా వొక బ్రాహ్మణకుటుంబం యిరుక్కుని ఛిన్నాభిన్నమై సర్వనాశనమైపోయింది.'

గతుకుల్లోంచి మిట్టపల్లాల్లోంచి కారు వూళ్లోకిరాగానే పిల్లలు గొడ్లకాడి కుర్రవాళ్లు కేకలేసుకుంటూ కారు వెనకాలే పరుగులెత్తసాగారు. అరుగులమీదకువచ్చి ముఖాలికి చేతులడ్డంచేసుకుని జనం కొంచెం దిగ్భ్రమచెందినట్లుగా నిలబడిపోయిచూస్తున్నారు. గ్రామం మధ్య పాఠశాలదాపుకు రాగానే కారు నిలబడిపోయింది. రాజు రబ్బరుకోటును లోపలే వదిలి తలుపుతెర్చుకుని బైటకు వచ్చాడు. ధర్మయ్య కారులో సెర్తుక్రింద రహస్యంగా దాచిన అందమైన చిన్న క్యాలికో చెక్కపెట్టెను చేతపుచ్చుకుని 'ఇది పట్టుగోండి చినబాబుగారూ! రాధాదేవి ఆఖరికోరిక...'

ఇరువురూ తల కొస్తవంచి పాఠశాలలోపలకు దూరారు. అది తాటియాకుల పురాతనపుశాల-వెదురుబద్దల్ని చీల్చి జాఫరీలా అల్లి అపాకను రెండుమూడు భాగాలుగా విడదీశారు. నేలంతా మన్ను. బల్లలులేవు పిల్లలు కూర్చుందుకు. అంతా చింకి-చింకి గోనెలమీద పలకలూ పుస్తకాలూ పర్చుసుని సరస్వతీపూజ చేస్తున్నారు. పంతులుగారి డ్రాయరు నల్లగా కొరకంచులా వెలవెలబోతూవుంది. ఆయనకు కూర్చునేందుకు కుర్చీలేకనో మరేకారణంచేతనే చెక్కపెట్టి నొకదాన్ని బోర్లించి దానిమీద అధివసించి వుండటంమాత్రం నిజం. మాస్టరుగారు కళ్లజోడు ముక్కుమీదనుంచిజారిపోతూండగా కంగారుగా లేచారు. పిల్లలుకూడా లేచినిలబడ్డారు. ధర్మయ్య యెదురువెళ్ళి పంతులుగార్ని ప్రక్కగా తీసుకెళ్ళి 'రాధమ్మ సవతి కొడుకు బాబూ-తవరితో పనుండి వచ్చారు.'

మాస్టరుగారు క్షణకాలం 'హా' అని తెరిచిననోరును అల్లాగే వుంచి 'వస్తున్నానుబాబూ-' అని పిల్లల్ని పదినిముషాలపాటు లోపల చదువుకొంటూండమని చెప్పి 'రండిబాబూ!-యీ పేదవాడి కొంప తమబోంట్లు మెట్టదగినది కాదుగానీ మా రాధాదేవి తరఫు నుంచి వచ్చాక ముందు ముఖ్యమైనది మీపని చూశాకే-'

కారు నిర్లక్ష్యంగా పరుగెత్తి ధర్మరాజు మేడచుట్టి వూరికి రెండవతట్టున మట్టిఅరుగులతో శుభ్రంగా అలికి ముగ్గులు తీర్చిన వో పెంకుటింటిముందు వచ్చి ఆగింది. ముగ్గురూదిగి యీవలకువచ్చాక-ధర్మయ్య 'ఇక్కడే ఇక్కడే బాబూ రాధమ్మను తొలిసారిచూసింది. అవునా- పంతులుగారూ నన్ను పోలికపట్టారా?'

పంతులుగారు కళ్లజోడులోంచి తేరిపారజూచి 'అవునవును-దాసుగారితో కూడా వచ్చింది నువ్వేగదూ? ఏమిమంచి-ఎంతచాకిరీ చేశారు బాబూ?' అని రాజునుద్దేశించి దాసుగారిది ఎంతజాలిగుండె-మూగమొద్దు, అది దిక్కులేనిదై పోతుందని రాధమ్మ జీవితసమస్యను నాపైన వేయండి-నేను చూసుగుంటాను, అని గట్టిగా నొక్కి మరీ చెప్పి కారులో ఆపిల్లను స్వయంగా తనబంగాళాకు తీసుకుపోయాడు.

పెళ్ళి చేసుకున్నారు. దాని బ్రతుకు కుదుటపడింది. లేకపోతే యేగ రాళకు దిక్కు? మొక్కా? కన్నుముక్కూ తీరు అన్నీ చక్కగా వుండి ధారాళంగా వాక్శుద్ధి గలిగి సద్గుణమైన పిల్లలకే పెండ్లిళ్లు కావటం కష్టమాయె-భగవంతుడున్నాడు సార్. అందుకనే ఆమాయకులకు దిక్కులేనివాళ్ళకు కష్టంలో ఎవర్నో ఒకర్ని బాబుగారి లాటి మహానుభావుల్ని చూపిస్తుంటారు. అంతా కులాసా బాబూ-లోపలికి దయచేయండి.!

ధర్మయ్య రాజు లోనికి అడుగుపెట్టేసరికి చూసిన దృశ్యం తాలూకు సందర్భం యిది.

ఒక పద్దెనిమిదేళ్ల అమ్మాయి చక్కగా విరబోసుకున్న కుంతలాల్ని చేత్తో సర్దుకుంటూ రెండవ చేత్తో తీక్షణంగా తర్జని ఎదుటి వ్యక్తి పైనిర్దేశిస్తూ యిలా ధారాళంగా చెప్పుకుపోతున్నది.—

'సెట్టీ నీకు బుద్ధి యిల్లా గడ్డి తింటున్నదేం? ఎన్నిమాట్లు నీకు కాళ్ళ వేళ్ళ పడి-ఆ ముసలిదాని చేతులోనుంచి యేదీ పుచ్చుకోవద్దని కచ్చితంగా చెప్పలేదు? ఆ ముసలమ్మ ఎక్కడనుంచో చీరెత్తుకొచ్చి నీకిస్తే ఆ దొంగసొమ్ము పుచ్చుకొని నువ్వు నల్లమందు యిస్తావా? అందరికీ తెలుసుగదా మా ముసలమ్మకు బుద్ధిలేదని-వెంటనే నాకు కబురుచెయ్యక కొంపమీదకు తగూలుతెచ్చి ఆనందించటం యిదా నీ బుద్ధి?'

శెట్టి చిరాగ్గా 'ఇందమ్మోవ్ మీ చీర-నా రెండు రూపాయలూ నాకు పారెయ్యండి. అంత పెద్ద పంతులుగోరితల్లి దొంగతనం చేస్తుందని నాకేంవెరిక-నన్నెందుకమ్మా తిడతావు? చేతనైతే మీ ముసలమ్మను సంబాళించుకోరాదూ?

మాస్టరుగారు యీ తగూ మధ్యలోకి వస్తూ 'యిష్...ష్ ఏమిట్రా ఆగోల? అవతల పెద్ద మనుష్యులు వచ్చి కూర్చుంటేను బయట-ఆపండి. ఏమిటి శెట్టీ తగూ....'

'రెండురూపాయ లిచ్చి చీరపట్టికెళ్ళ మంటున్నాను. మీ అమ్మగోరు చీరెత్తుకొచ్చినారని నాకేం తెలవదు. దొంగసొమ్ము కొంటం నా యింటా వంటా లేదు. పెద్దపంతులుగోరి తల్లి గందా అని నల్లమందు యిచ్చాను. చూడండయ్యాగోరూ మీ జయమ్మగోరెల్లా తిడతావుందో?'

పంతులుగారు నీళ్లు నములటం ఆరంభించారు.

'ఊరుకో విజయా-లోపలకు పదు. సెట్టీ నువ్వుపద-నీకు రెండు రూపాయ లివ్వాలా? జీతం ఘట్టురాగానే కనిపించు బాబ్బాబు ఎవరో పెద్దమనుష్యులు రాకరాక వాకట్లో కొచ్చారు' అని నూతిదగ్గర పళ్లెంలో కూర్చున్న తల్లి నుద్దేశించి 'ఏమిటే యీపాడు పనులు? ఎప్పుడూ యేదోవొకటి యెత్తుకొచ్చి నా ప్రాణంమీదకు తీసుకురాకపోతే—కుదురుగా కొంపలోపడి యేడవరాదూ? నన్నేం వూళ్లో తలెత్తుకు తిరగనీయ్యరా యేమి ఈ కొంపలోవాళ్లు.'

'అబ్బే—అంతా ఉట్టిదిరా అబ్బాయీ. దొంగతనమా—నాకేం ఖర్మ? కాలూ చెయ్యీ వంగాక కళ్ళూ కాళ్ళూ కనిపించక పోయాక ఎన్నైనా అంటారు? రవ్వంత నల్లమందు పెట్టమంటూ యిల్లా అడిగానో లేదో చీరెత్తుకొచ్చి తాకట్టు పెట్టిందని అభాండం నా నెత్తిన వేశారు. రామ! రామ!!'

'నువ్వూరుకో నీకు తెలీదు బాబయ్యా—యీ శెట్టికి దొంగ సొమ్ము కొనటం మాబాగా అలవాటయింది. రెండు రూపాయలు నాకు కదా రెండు కాణీలుకూడా యివ్వొద్దు—ఎల్లా యివ్వడో చూస్తానుగా. పద శెట్టీ. నేను మీయింటికొస్తున్నాను. ఇంకా ఎక్కువ డబాయించావో నువ్వే దొంగతనాలు చేయిస్తున్నావని కేసు పెట్టిస్తాను. దాంతో తిక్క కాస్తా కుదిరిపోతుంది తెల్సిందా?'

బాబయ్య రెక్క పుచ్చుకు లాగాడు విజయను.

'కాస్తంత నెమ్మదిగా మంచిపిల్లలా మాట్లాడు విజయా. నీకోసం ఎవరో పెద్దమనుష్యులు వచ్చి వాకట్లో కూర్చున్నారు. ఆ జుట్టూ అదీ కాస్త ముడివేసుకుని వోమారు ముఖం కడుక్కొని కాస్త శుభ్రంగా రారాదూ?'

మూతి వంకరగా పెట్టి నడుంమీద చేయి ఆన్చి అదోలా బాబాయికేసి చూసింది.

'అవును తల్లీ! చుట్టాలొచ్చారు నీకోసం—చప్పున తెవుల్చుకురా.'

'ఎవరు బాబూ— అంత హఠాత్తుగా ఆకాశంమీంచి వూడి పడిన చుట్టాలు?'

'చెప్తానుగా—మంచినీళ్లు కాస్త ఫలహారం ఏమన్నా వుంటే చూడు తల్లీ.'

బాబయ్య నడవలోకి తప్పుకున్నాడు అతిథుల్ని పరామర్శించేందుకు. విజయ నీళ్ళతో ముఖం కడుక్కొని చప్పున ఆదరా బాదరా చీరమార్చుకుని, పొయ్యి ఎగసనదోసి టీనీళ్లు పడేసి, వంటయింటిగూట్లో సజ్జలోంచి రెండు రెండు అరటిపళ్ళూ రెండేసి మినపసున్నివుండలూ పళ్లెరంలో పెట్టుకుని—మంచినీళ్ళ గ్లాసు చెంబు వోచేత్తో పుచ్చుకుని, యెవరా ఆవచ్చిన చుట్టాలనుకుంటూ నడలోకి కాలుపెట్టగానే—మన్నుగొట్టుకుపోయిన ముఖం విషాదాక్రాంతమైన చూడ్కులతో, బల్లమీద నేరస్థుడిలా కూర్చున్న రాజేశ్వరరావుని నేలమీద చాపమీద భాసింపట్టు వేసుకు కూర్చున్న ధర్మయ్య యీరెండు కనీ వినీ ఎరుగని క్రొత్తముఖాల్ని చూడగానే క్షణంసేపు తటపటాయించి బాబయ్యముఖంలోకి చూసింది.

రాజేశ్వరరావు పెదిమ కొరుక్కుంటూ భయంభయంగా తలెత్తి విజయముఖంలోకి చూసాడు. అదే పోలిక—అవే చక్రాల్లాటి విశాలమైన నయనాలు. అదే దేహకాంతి—సరిగ్గా రాధాదేవి నడిచివచ్చినట్లుగానే వుంది.

'చిన్న బాబుగారూ-మాశారా! ఆయమ్మ యీయమ్మే.... అదే పోలికని అచ్చుగుద్ది పడేశాడు భగవంతుడు.'

'నువ్వన్నా చెప్పు ధర్మయ్యా-నేను చెప్పలేను.'

రాజా రెండుచేతుల్తో ముఖాన్ని కప్పుకుని పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటున్నాడు. విజయ చలితమనస్కురాలై, అయోమయంగా నిలబడిపోయినది, మంచినీళ్లను చాపమీద వుంచుతూ. ఫలహారపు పళ్లెరాల్ని బల్లమీద వుంచబోయింది.

'అబ్బాయీ తల్లీ! మంచిమాట చెప్పిపోవటానికి రాలేదు. కుటుంబాక్త వారసగా వచ్చిన సొమ్ము నీకోసం'—

రాజు తడబడ్తూ లేవబోయి మళ్లీ బల్లమీద ఎవరో వెనక్కి త్రోసినట్లు కూలబడ్డాడు. పంతులుగారు తెల్లబోయి నిలువు గ్రుడ్లేసుకుని చూస్తున్నారు. అతను అతికష్టంమీద అందమైన చిన్న క్యాలికో చెక్కపెట్టెను వొణుకుతున్న చేత్తో అందిస్తూ 'ఇది నీకివ్వమని చెప్పిపోయిందమ్మా మీ అక్క. తీసిచూసుకో... మూస్తాపో మీ రాధమ్మ వెళ్ళిపోయిందండీ. పాపం మానాన్నగారి ఔదార్యాన్ని చాలా ప్రశంసించారు. ఎవరి ఔదార్యంతోనూ నిమిత్తం లేకుండా ఆమె నిష్కంటకమైన మార్గాన్నే చూసుకుంది.'

విజయ కాంతివంతమైన ముఖమండలం నల్లగా పొగచూరినట్లయిపోయింది. ఆ చేతిలోని పెట్టెను భద్రంగా విప్పి అందులోంచి తీసిన వెండిచుట్టు తీగలో అరిగిపోయి నలవెల బారుతోన్న పొగడాల దండవైపు అందరూ క్షణకాలం ప్రశ్నార్థకంగా చూశారు. విజయకళ్లలో నీరు చుట్టుగుంటూండగా—

'ఇది మా అమ్మ వేసుకునే పొగడాలదండ—ఎంత సర్దుగా దాచిపెట్టింది మా అక్క పాపం! మాట్లాడ లేకపోయినా యిది భద్రంగా దాచుకుని మమ్మల్ని జ్ఞాపకం చేసుకునేది కాబోలు.... నా కోసం పం...పిం....చిం...ది. ఇదే మాకు చివరి గుర్తు ఇదే మాకుసంబంధం...చివరికింతకన్నా యేమీ మిగలలేదు' తలుపుని కర్చుకుని విజయ పొగడాలదండను వ్రేళ్లతో చేతికిచుట్టుకుంటూ రుద్ధకంఠంతో—' ఏదో గొప్ప యింట్లోకి వెళ్లిపోయిందన్న తృప్తితో మమ్మల్ని మభ్యపెట్టి బ్రతికివున్నన్నాళ్లూ మమ్మల్ని శాశ్వతంగా శోకర్నాకరు చూసుగోనీయకుండా చేశారు మీ నాన్నగారు. మాట్లాడ్డం రాని మా అక్కను మీ హోదాలు అంతస్తుల్లో కట్టేసి శాశ్వతమైన బందీని చేసేశారు. పోనీలెండి; మీకటకటాల్ని త్రెంచుకుని యీ క్రూరమైన అంక్షల్నుంచి కొంక్షల్నుండి రెక్కలు వచ్చిన పిట్టలా ఎగిరి చక్కాపోయింది. మీరీకబురు తెలుసుకోకపోయి వుండినట్లయితే యింకా ఎక్కడో మా రాధ మూగబాధలు అనుభవిస్తున్నదనే అనుకునేవాళ్ళం.' దుఃఖంనిండి ఆమె గొంతుక పూడిపోయింది. ధర్మయ్య గుడ్లప్పగించి చూస్తున్నాడు. చెరగుతో ముఖాన్ని రుద్దుకుంటూ పరుషంగా—'మా దుఃఖంలో మేము మునిగివున్నాము. అప్పుడు ధర్మరాజుగారు మా నాన్నమీద కేసు నడుపుతున్నాడు. ఆయనకొలువులో వున్నప్పుడు శిస్తులు వసూలుచేసిన బాపతు పదిహేను వేలదాకా మానాన్నగార్ని లెక్క చెప్పవలసిందని లేకపోతే జైలు తప్పదని ఆయన్ని బెంగలో ముంచేశారు. ఆ కేసులో మా నాన్నగారు ధర్మరాజుగారి సొమ్ము తినేసివుంటే యీ గర్భదారిద్ర్యం—గుండెలు పగిలి మానాన్న చావవలసి రావటం ఎందుకు? ఈ మాట ఎవరూ నమ్మరుకారు. ఆయనెక్కడో యీ డబ్బు దాచుకున్నాడని అనుమానం అందరికీనూ. చివరికి మరణావస్థలో క్రింద పడేసినప్పుడు శోకసముద్రములో మునిగిపోయిన మమ్మల్ని కడుదయతో మీ నాన్నగారు వచ్చి బుజ్జగించి పదేళ్ళదాన్ని నన్ను యీ బాబయ్యగారి వశంచేసి తానేమో మా రాధమ్మను కోడలుగ్గించుకుని పెళ్ళిం తీసుకెళ్ళిపోయి పెళ్లాడేసాడు. ఎంత గొప్ప సంస్కర్త? యేమిజాలి? అని అంతా మెచ్చుకోవటమే—నోరులేని మా అక్క రేమని చెప్పుకోగలదు? ఎవరున్నారిక్కడి ఆదరించేందుకు? పేదవాళ్లమని దిక్కు లేదని, మూగపిల్లని యీవగేం చేసుకుంటారని గుసగుసగా అందరూ వెనక్కి జారుకుంటే మా అక్కను హరించుకుపోయి దాని బ్రతుకు ఆర్పివేశారు మీ నాన్నగారు. సంఘంలో అపడానికి జీవితం బలిపీఠమయిపోయిందే? ఓహో యేమి విశాలహృదయం? మీడ్రైవరు సాపారావని అతను వచ్చిచెప్పాడు. దాసుగారు రాధతాలూకు మనుష్యులెవ్వరూ ఎప్పుడూ బంగాళా పొలిమేరలు త్రొక్క వల్లకాదని కబురు పంపెంచారు. ఆయనేం మనిషి? మావి మనుష్యజీవితాలు కావ—ఆటబొమ్మ లనుకుంటున్నారా? పేదరికంతో పరిహాసా లాడ్తారా? మా దుఃఖం, మా కన్నీళ్లు బాకులూ వుప్పెనలా వచ్చి మిమ్మల్ని ముంచెత్తేస్తాయని నేనన్నానని మీ నాన్నగారితో చెప్పండి'—

ఎడా పెడా లెంపకాయ కొట్టినట్లనిపించి వళ్లంతా జలదరించింది రాజుకు. ధర్మయ్య పంతులుగారి నుద్దేశించి 'ఈ పొగడ దండను అబ్బాయి పట్టుగెళ్ళి ఈ చెల్లాయి కిచ్చిరావాలని రాధమ్మ కోరిక—ఈ అమ్మని యెంత యెత్తుగా మనస్సులో తల్చుకునేదో అంత యెత్తునే యీ అబ్బాయిగార్ని రాధమ్మ ఆపేక్షగా చూసుకుంది. చివరికి వొక్కరూ కంటికి కనిపించకుండానే బ్రతుకు తెల్లార్చేసింది.'

పంతులుగారు నెమ్మదిగా విజయనుద్దేశించి - 'ఇంటికివచ్చిన అతిథుల్ని కోపంగా నాలుగుమాటలన్నావుగదా చాలు! మంచి చల్లని ముక్కలుకూడా రెండు చెప్పు తల్లీ!'

'చినబాబుగారూ! మనం వచ్చినపని అయిపోయినట్లే—మీకెప్పుడు రాధమ్మగార్ని చూడాలనిపించినా, పడితే నాలుగు మాటలు వోర్చుకునీ ఇక్కడకు వచ్చినట్లయితే మీ కనువాపిరి తీరిపోతుంది. లెండి-అమ్మాయిగారూ! మీ రాధమ్మకు ప్రియమైన వస్తువులు రెండు తెచ్చాము-ఒకటి మీకిచ్చి రెండవది మాతో తీసుకు వెళ్ళిపోతున్నాము.'

రాజు నీరసంగాలేచి 'మాటల్ని పడ్డానికి నేనెప్పుడూ వెనుకాడను. విషభాండాల్లాంటి అభాండాలు నా నెత్తిన ఎప్పుడూ పగుల్తూంటాయి.'

విజయ పొగడదండను క్యాలికో చెక్కపెట్టెలోఉంచి మూత వేస్తూ-'మీ రెండువస్తువులూ మీదగ్గిర్నే ఉండనివ్వండి — యిదొక్కటే పాపం ఇక్కడెందుకు?' అని ఆ పెట్టెను జాపిన అతడి చేతిలో ఉంచుతూ అప్రయత్నంగానే అతడిచేయి తగులగానే-

'అమ్మబాబో ఎంత వేడిగావుందో - జ్వరంకాదుగదా?' అని పెట్టెతోసహా షాకుతిన్నట్లయి చేతిని వెనక్కు లాగేసుకుంది. ధర్మయ్య రాజు నుదుటిమీద చేయివేసి 'అమ్మాయిగారూ మీరు చెప్పింది నిజమే-జ్వరం బాగుబాములా ప్రాకింది. పదండి కారులో రెండుగంటల్లో వెళ్ళిపోతాము.'

పంతులుగారు రాజుకు ముట్టుకుని నాడీ పరీక్ష చేసి అన్నారు— 'చాలా నీరసంగా వుంది' అని. రాజు దృష్టి పక్కింటిలోని విజయ కున్న వంటిమీద పడింది. వంగుని దాన్ని అందుకోబోతూంటేనా విజయ ఇత్తడి పళ్ళేరాన్ని ప్రక్కకు లాగేస్తూ 'అమ్మో యింకే మన్నా ఉందా—మీనపసున్ని తింటే జ్వరం ఒంటిమీద కొంప మునిగిపోదూ—'

'మునిగిపోయేదేమీ ఉండదులే—' అని చిన్నగా నవ్వాడు రాజు. పంతులుగారు బైటకువెళ్ళి కారుమబ్బు చేరిన పుత్రమూకను బెదిరించి స్కూలుకువెళ్లి నలుగురుపిల్లల్ని కాపలా కాస్తూండమని బండిదగ్గరకు పంపించారు. విజయ తన చల్లనిహస్తాలతో మెత్తటి ప్రక్కను పర్చి తల బ్రద్దలుకొట్టేస్తున్నదని రాజు గోల పెట్టేస్తుండగా బలవంతాన నూరుకొచ్చి కంట్లో కలికం పెట్టేసింది. రాజు అమ్మో! అమ్మో! అని వాపోతుండగా 'మాడండి. మీతో నాకేం విరోధం లేదు. గంటసేపటికల్లా మీ శిరోభారం యావత్తూ దిగజారిపోకుంటే నన్ను విజయా అని పిలవకండి.' బయట అరుగుమీద ధర్మయ్యను ఆ ఇంట్లో ముసలమ్మ తానేమీ చీర దొంగిలించుకు రాలేదనీ నల్లమందు అమ్మే కోమటిమాటలన్నీ బూటకమనీ అవేవీ నమ్మవద్దనీ నచ్చచెబుతోంది.

3

ఇంకా వెఱ్ఱిగాలి వుండివుండి వీస్తూనేవుంది. కారు నిర్లక్ష్యంగా జలజలమని పారే బురదనీటిని చిందగొడ్తూ వెళ్ళిపోయింది. రామదాసుగారు టక్కున తలను యీవలకు లాక్కుని కిటికీ మూసేశారు. గదిలో చిమ్మచీకటి—కుమ్మానికి కట్టిన తెరలు స్వేచ్ఛ కోసం గింజులాడుకొంటున్నాయి. లాంగుగౌనులో ఆయన దేహం కజకజలాడింది. పైపుతీసి బాగా రెండుమూడు దమ్ములు పీల్చి అద్దంముందు వచ్చి నిలబడ్డారు. మసగమసగ్గా నల్లటి భయంకరమైన నీడ అద్దంలో గోచరించింది. తల గిఱ్ఱున తిరిగిపోతోంది. బంగళా యావత్తూ కెఱటాల్లో వూగిసలాడుతున్న నావలా తోచింది. క్రమంగా ఆయనకు భయం లోపల క్రమ్ముకసాగింది. అలమార్లోంచి తాళాలుతీసి బీరువా తెరిచారు. వణుకుతున్న చేతుల్తో నోట్ల కట్టల్ని యీవలకు లాగారు. మళ్ళీ తాళం వెయ్యలేదు. టేబిలు మీద కాస్సేపు తడిమారు. టక్కున బల్లమీద దీపం వెలిగి వులిక్కిపడ్డారు. ఒక్కమాటు నేలమీద కూర్చుని మంచంక్రింద చూశారు. చుక్కల చుక్కల జాకెట్టు రాధాదేవిది మూలను గోడవారను దిగుకను వ్రేలాడుతోంది. కళ్లు గట్టిగా మూసుకుని బలవంతాన వొక గుంజ తీసినట్లు లేచి నిల్చొని హాల్లోకి వచ్చేశారు. ఎదురుగుండా పెద్దభార్య తాలూకు తైలవర్ణచిత్రంలోంచి ఆ యిల్లాలు పెద్ద తరహా చీరకట్టు, వొంటినిండా వొంటెడు నగలు, అర్ధణా కాసంత కుంకుమబొట్టు—ముఖాన గౌరవనీయమైన ముడతలు గీతలతో, 'నేనంతా కనిపెడ్తున్నాను సుమా—' అని పలకరిస్తున్నట్లుంది. దాసుగారు తీవ్రంగా విసుక్కున్నారు. 'యీ పీడబొమ్మ వ్రాయించకపోయినా బాగుండిపోయేదని' కంగారుగా అద్దాల తలుపుల కిటికీవద్దకువచ్చి నిలబడ్డారు. ప్రక్కనే తన్ను రాసుగుని ఎవరో చూసుకు వెళ్లినట్లయింది. అక్కడింకాలి మూగబాధను వ్యక్తం చేస్తున్న రెండు సజలనయనాలు కిటికీ అవతలనుండి తన్ను చూస్తున్నాయి. గబాగా చేతుల్తో కోపలక్ష్మి తడిమారు. హాల్లో లైట్లు హఠాత్తుగా వెలిగాయి. కళ్లకద్దింగా రాజు వెడ్డెంకు ట్రంకుపెట్టి కదలనివ్వేట్టు లేవు. మూగపిల్ల రాధాదేవిని ఆక్రమించుకుని అనుభవించి ధ్వంసంచేసిన నేరానికి—రాజుకి దయలేదు. ఒక్కనాటికీ తన్ను క్షమించడు. ధర్మయ్యకూడా వెళ్ళిపోయాడు. తన పాపాల ఘోరమైన చిట్టా అంతా క్రమం తప్పకుండా వ్రాసివుంచిన చిత్రగుప్తుడు. దాసుగారు కళ్లు గట్టిగా మూసుకున్నారు. ఆయన మనోనేత్రాలముందు చిత్రపటంలోలా ధర్మరాజు కేసులోపడి నలిగి నాశనమైన రాధాదేవి తండ్రి చావు ప్రత్యక్షం కాసాగింది. ఘోరమైన ఆరోజు కురిసిన వానలో కూరుకుపోయిన కారులోంచి దిగి పన్నిన పన్నాగంలో యిరుక్కున్న పదహారేళ్ల జవ్వని బ్రతుకు భారం చేతచిక్కించుకున్న వైనం—కొలుకంచుల్లోంచి కాల్తున్న మందభాగ్యుడు నిప్పుముద్దల్ని విసరి తిరుగని శాపం విసర్తున్నాడు. ఆ మూగపిల్ల అందమైన ముఖం, పెద్దపెద్ద కళ్లు, వినీలకుంతలాలు, చక్కగా వంపులుతిరిగిన పెదవులు—బలిష్టమైన శరీరం అణుదింపు ఆ యవ్వనాన్ని కంబళించాలనే దాహంముందు—బలిగావించబడ్డ క్రూరంగా వంచింపబడిన పేగుసంబంధం—దారి కడ్డుకాబోయిన పాపారావు మీసాలు. ఒకడు వుద్యోగంనుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించబడ్డాడు. రెండవవాడు లజ్జతో తలవంచుకుని పెట్టేబేడా సర్దుకుని కంటికి కనపడకుండా కలకత్తా పారిపోయాడు. పారిపోయినవాడు మళ్లీవచ్చాడు. ఈ ధర్మయ్య ఎంతకైనా తగును. వీడే పిలిపించాడు. దాసుగారు పళ్లు పటపటా పిండుకొని పిస్తోలు కోసం కోటుజేబుల్ని తడుముకున్నారు. ఆ క్షణంలో ఆయనకు పిస్తోలు చాలా అవసరమనిపించింది. వెంటనే పడకగదిలోకి పరుగెత్తి టక్కున ఆగిపోయారు. బీరువా తలుపులు తెర్చేవున్నాయి. దీపం ఖణీగా వెలుగుతోంది. గదిలో ఎవరో దూరినట్లు అనుమానం వేసింది. ముందుకీ వెనక్కీ చూసి పగలబడి నవ్వబోయి నవ్వురాక బీరువాలోంచి బ్రాందీబుడ్డీ తీసి తాళంచుత్తులతో కార్కు పీకిపారేసి అలమార్లోని గ్లాసుతెచ్చి వంపుకుని గటగట గుక్కమీద గుక్క పీల్చేసి పిస్తోలుకోసం అరల్లో తడుముళ్లాడి మొత్తానికి తూటాలు నింపుతూండగా 'జిమ్మీ' భయంకరమైన అరుపు దాసుగార్ని వివశుల్ని చేసిపారేసింది. కోపంగా ఆయన మెట్లవద్దకు పరుగెట్టారు. పెద్ద చప్పుడు చేసుకుంటూ దిగి పిడికిలితో గాజు తలుపును బ్రద్దిముక్కలుచేసి పిస్తోసును హాల్లోకి సూటిగా మూడుమార్లు ధామ్మనిపించారు. పెద్ద చప్పుడయింది. ఏ బీరువాయో బ్రద్దలయింది. జిమ్మీ యింకా బిగ్గరగా గది అంతా విశృంఖలంగా తిరుగుతూ అరుస్తోంది. దానికి తగిలుండాలి—చావలేదు. వరండాలో దీపం వెలిగించటానికి దాసుగారికి ధైర్యం చాలలేదు. తలుపుల్ని తెరిస్తే జిమ్మీ పట్టుకుంటుంది—ఛీ! యింత బ్రతుకూ బ్రతికి చివరికి కుక్కచేతిలోనా చావు! వెనక్కుతిరిగి హాల్లోకి రాగానే అద్భుతమైన యోచన బుర్రలో మెరిసింది. గదిలోకి పోయి ప్రయాణపు సంచీ తెచ్చి కొన్ని బట్టలు నోట్లకట్టలూ అందులో కుక్కి తాళాలు తలిమ్మాటి ఎక్కడి వక్కడ వదిలేసి పలాయనానికి

పడ్డాడు. పిస్తోలు యింకా చేతిలోనేవుంది. అప్రానికి ముఖాన్ని అన్ని బయటకు చూశారు. చీకటి మసకమసగ్గానే వుంది.

దాసుగారు మెట్లుదిగి వరండాలోంచి నెమ్మదిగా దొంగలా నక్కి నక్కి తోటలోంచి గేటువైపుకు నడకసాగించాడు. హఠాత్తుగా వెనకనుంచివచ్చి పట్టుకుంది 'జిమ్మీ'--జిమ్మీ ఎల్లావచ్చింది? కిటికీ బ్రద్దలయివుంటుంది. అబ్బా గట్టిగా పట్టుకుందే? దాసుగారు పిస్తోలును ధామ్మని పేల్చబోయారు. తూటాలు ఖాళీ... అయ్యో! అయ్యో!! అయ్యో!!! ప్రయాణపు సంచీ పడిపోయింది. జిమ్మీ కాళ్లను పట్టుకు పీకేస్తోంది. దాసుగారు విడిపించుకోలేక బోర్లా పడ్డాడు మొక్కల్లో. భీకరంగా అరుస్తున్నారు. ఆ వొంటరి బంగళా ఆయన ఆక్రందనాలకు దద్దరిల్లిపోతోంది. ఈ వెధవ కుక్క చేతిలో చావు ఎల్లాగూ తప్పనట్లుందే—ముష్టాముష్టి యుద్ధం ఆరంభమయింది. గోళ్లతో గుండెల్ని రక్కుతూ యథేచ్ఛగా చేతుల్ని కరిచేస్తోంది. దేహమంతా రక్తాలు గాట్లు—కాళ్లు పీకేసింది. చేతుల్ని కొరికేసింది. అయ్యో! అయ్యో! బాధ—బాధ—ఎవ్వరూ లేరు. ఎంత దిక్కుమాలిన చావు? గోంక్రడింపు ఆరంభమయింది. పరుగెత్తలేను — పారిపోలేను—ఎవరో పగ దీర్చుకుంటున్నారు? జన్మ జన్మాంతకసి—కాలభైరవుడి వాత—అయ్యో యీ దిక్కుమాలిన శవాన్ని చూసి యెవరు జాలిపడ్తారు? ఎవరొక కన్నీటిబొట్టు రాలుస్తారు? యీ మొక్కల్లో కుప్పలో... జిమ్మీ దాసుగారి దేహాన్ని యిష్టంవచ్చినట్లు తుండీలు తుండీలుగా కొరికి కాళ్ళతో బంతిలా తోస్తూ గంటా గంటన్నర చిత్రవధ చేసి తిన్నగా గేటువైపు పరిగెత్తి శ్మశానంరోడ్డుచ్చుకుంది.

తెల్లవారింది. సూర్యుడు ఫెళ్లున కాస్తున్నాడు. దాసుగారు దేహంనుండి వరదలుకట్టి తెట్టెలు తెట్టెలుగా గడ్డిలో మొక్కల్లో యినికిపోయిన నెత్తురు తళతళా మెరుస్తున్నది. పిస్తోలు ప్రక్కగా నేలమీద పడిపోయివుంది. ప్రయాణపు సంచీ యింకా కొంచెం దూరంగా విసరివేయబడివుంది. అందులోంచి నోట్ల కట్టలు పొట్టల్ని విచ్చుగుని సూర్యుణ్ని చూస్తున్నాయి. దాసుగారి నిలువుగ్రుడ్లుమాత్రం భీతావహంగా మొక్కల్ని పరికిస్తున్నాయి. బంగళాలోకి పది పదిన్నరవరకూ యెవ్వరూ రాలేదు. ఆ తర్వాత పదకొండూ ఆ ప్రాంతాల ఒక సైకిలువచ్చి ఆగింది. పోస్టు జవాను గేటుదాటి లోపలకు అడుగుపెట్టి కెవ్వున కేకేసి వీథిలోకి పారిపోయి పదిమందిని ప్రోగుచేసుకొచ్చాడు. ఆ వెనుక పోలీసువాళ్లు వచ్చారు. బంగళా అంతా కలయతిరిగారు—అంతా ఖాళీ, నిశ్శబ్దంగా వుంది. క్రింద హాలువెనుక కిటకీ విచ్చిపోయివుంది. ఆ కంతల్లోంచి లోనికిచూస్తే బీరువాలు పగిలిపోయి అద్దాలు ముక్కలు ముక్కలయి నానాభీభత్సంగానూ వుంది. అంతా ఆశ్చర్యపోయారు. పైన మేడమీది గదుల్లో బీర్వాలలమారాల తలుపులన్నీ తీసివున్నాయి. కొర్కు విసిరివేయబడ్డ ఖాళీ బ్రాందిసీసా టేబిలు మీద వుంది. టేబిలులైటు హాల్లోని లైటన్నీ అట్లానే వెలుగుతున్నాయి. పెద్దు ఖాళీగావుంది. అక్కడ వుండవలసిన కారుకూడా లేదు. కారుపోయిన మార్గం గుర్తుపెట్టుకుని పోలీసులు తిన్నగా శ్మశానానికెళ్ళారు. అక్కడ హంతకుడు నిశ్చింతగా నిర్వికారంగా నోటినిండా ముఖంనిండా నెత్తుటి మరకలతో ప్రత్యక్షమయ్యాడు. కారులో వచ్చింది కుక్కగాదని తెలిసిపోయింది. కాటికాపరిని అడిగారు. రాత్రి ఎవరోవచ్చి కొన్నేపు విచారించి వెళ్లారని తెలిసింది. పోలీసు అధికారులు కారునెంబరు యిచ్చి మోటారు సైకిళ్ళను నాలుగువైపులకూ త్రిప్పారు. సాయంత్రం మూడుగంటలకు ధర్మయ్యనూ రాజేశ్వరరావును కలుసుకుని పోలీసులు యీ సుర్వార్తను విన్నవించారు. రాజు కళ్లు తిరులుకమ్మి తలతిరిగి పడిపోయాడు. విజయకూడా వస్తానంటే రాజు ధర్మయ్య వారించారు. సరిగ్గా నాలుగుగంటలకు ధర్మయ్య రాజు వచ్చి బంగళాముందు కారులోంచి దిగారు. పోలీసు అధికారులు చుట్టుముట్టి ప్రశ్నల వర్షాలు కురిపించారు. వాఙ్మూలాలు రాసుకున్నారు. జిమ్మీని పోలీసు వానులో ఎక్కించుకొని వచ్చారు. రాజును చూడగానే దిగులుగా వున్నదల్లా సంతోషంతో తోకాడిస్తూ మూలిగింది. దానిక్కూడా గుండుదెబ్బ తగిలినట్లు గాయాలు స్పష్టంగా చెబుతున్నాయి.

ఈ కబురప్పుడే పూరంతా ప్రాకిపోయింది. జనం తండోపతండాలుగా యీ వొంటరిబంగళా చూడ్డానికి రాసాగారు. పత్రికలవాళ్లు రాజును పీక్కుతింటం ఆరంభించారు. ప్రెస్ ఫోటోగ్రాఫర్లు 'జిమ్మీ' ఫోటోలుతీసుకుని దాసుగారి శవం ఫోటోతో సహా వార్తల్ను ప్రచురించారు. బంగళాను సీలువేసి పోలీసు కాపలాపెట్టారు. ధర్మయ్య రాజూ పోలీసుస్టేషను చుట్టూ కోర్టుల చుట్టూ కాళ్లు బలపాలుకట్టేలా తిరిగారు. కేసు పరిష్కారమయేసరికి దాసుగారి కుటుంబకథనం యావత్తూ పత్రికల్లో వింత వింత శీర్షికల్లో ప్రజలు చదివి ఆనందించారు. రాజు బాగా కృంగిపోయాడు. ప్రభుత్వం అంతా పరిష్కరించి యావదాస్తిని బంగళాను తిరిగి వప్పగించబోతే రాజు ఆ బంగళాను ఆసుపత్రిగా వాడుకోమని ఆ యావదాస్తినీ ఆ ఆసుపత్రిపరంగా ఖర్చుచెయవలసినదిగా వ్రాసియిచ్చాడు. ఎంత చెప్పినా వినకుండా పోలీసులు జిమ్మీని కాల్చిపారేసారు. రాజు యిప్పటికీ ఆ బంగళావైపు పోడు. దాని పేరు తల్చుకుంటే అతనికి స్పృహ తప్పిపోయినంత పనవుతుంది. రాజేశ్వరరావు పట్నంలో పాతికరూపాయలకు యిల్లొకటి అద్దెకు తీసుకుని అందులో ప్రాక్టీసుపెట్టాడు. ఆ యింట్లో బొత్తిగా వస్తుసామగ్రిలేదు. అక్కడే అతడికి వివాహంకూడా అయింది. అతడి వివాహానికి పోలీసు అధికారులు పత్రికా విలేఖరులూ ఎక్కువమంది వచ్చారు. ఇప్పటికీ విజయ తనకు తలనొప్పి వస్తే కలికంపెడ్తానంటుంది. ధర్మయ్య సుష్టుగా రెండుపూటలా భోంచేసి పూరంతా తిరిగితిరిగివచ్చి అరుగుమీద తలగుడ్డ పర్చుకుని పడుంటాడు. రాజూ-విజయా యిద్దరూ సంసారానికి కావలసినవన్నీ స్వయంగా చూసుకుంటారు. ఆమె గీచిగీచి ఖర్చుపెడుతుంది. అతను కొసరి కొసరి డబ్బులిస్తూంటాడు. పర్సులో తడి ఆరిపోవటంకూడా కద్దు. చెప్పుకోతగ్గ ప్రాక్టీసుకూడా యేమీలేదు. కోర్టుకుకూడా కాలినడకనే వెళ్ళివస్తూంటాడు. ఇద్దరూ అప్పుడప్పుడు సినిమాలకు వెళ్ళివస్తూంటారు. ఏవన్నా పేచీలు మంకుపట్లు పడితే ధర్మయ్యే కాస్త అప్పుడప్పుడు మధ్యవర్తిత్వం నెరపుతూవుంటాడు. జీవితం ఎల్లాగుందని యెవరూ అడగరు. అడిగితే చక్కగ్గా నాజూగ్గా పదునుగా వుంది—ఈ పదును చెడగొట్టొద్దని వేడుకుంటానంటాడు. ఎప్పుడన్నా బజారున పోతూ చటుక్కున ఆగి, బఠాణీలుకొని జేబులో పోసుగొని—చానాగరం దుకాణందగ్గర ఆగి ఒక అణా కారపు మిరపకాయలు కొని లొట్టవేస్తూ, పంపు దగ్గర దోసెడు మంచినీళ్ళని నోట్లో పోసుకుని, నిర్వికారంగా కోర్టునుంచి చవకరకం సిగరెట్టు కాలుస్తూ యింటికిపోయే న్యాయవాదిని యెప్పుడన్నా చూడ్డంగనక సంభవిస్తే అతనే రాజేశ్వరరావని తప్పకుండా గుర్తుపెట్టుకోవలసుంటుంది.